ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అనకాపల్లి
జిల్లా వార్తలు

సోమవారం 26 ఫిబ్రవరి 2024

'చోడవరం'లో 29న నారా భువనేశ్వరి పర్యటన



బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి ఈ నెల 29న చోడవరం నియోజకవర్గానికి రానున్నట్టు టీడీపీ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు తెలిపారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా రోలుగుంట మండలం జేబీ అగ్రహారం, కొవ్వూరు; రావికమతం మండలం గొంప వానిపాలెం, బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరంలో పర్యటిస్తారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేయడాన్ని తట్టుకోలేక ప్రాణాలు వదిలిన బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారని తెలిపారు.

వైసీపీలో గందరగోళం

ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు తుది అభ్యర్థులు కాదంటున్న వైవీ సుబ్బారెడ్డి


- వచ్చే నెల మూడో తేదీ తర్వాతే జాబితా ప్రకటిస్తామని వెల్లడి
- ఆశావహులతోపాటు నేతలు, కార్యకర్తల్లో ఆందోళన
- ఇప్పటికే 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ, జనసేన కూటమి
- ఇంకా వేచి చూసే ధోరణిలోనే వైసీపీ అధిష్ఠానం
- విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందంటున్న నేతలు, కార్యకర్తలు



గుడివాడ అమర్‌నాథ్



మలసాల భరత్



కరణం ధర్మశ్రీ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

సాధారణ ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎవరనే దానిపై ఆ పార్టీ నాయకుల్లో గందరగోళం మరింత పెరుగుతున్నది. ప్రస్తుత ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు ఫైనల్ కాదని, వచ్చే నెల మూడో తేదీ తరువాతే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. టీడీపీ, జనసేన కూటమి దాదాపు వంద మంది అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల కదన రంగంలోకి దిగుతుండగా... ఇంకా అభ్యర్థులను ప్రకటించడానికే సమయం పట్టేలా ఉందని వైసీపీ అగ్రనేతలు చెబుతున్నారు. ఇది వైసీపీ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని కిందిస్థాయి నాయకులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలో ఇప్పటికే ఎన్నికల వేడి రాజుకుంది. అధికారం నిలబెట్టుకోవాలని వైసీపీ... అత్యధిక సీట్లు దక్కించుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని తెలుగుదేశం, జనసేన పార్టీలు వ్యూహాలను రచిస్తున్నాయి. ఇందులో భాగంగా వైసీపీ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పలుమార్లు సర్వేలు నిర్వహించింది. గెలుపు అవకాశాల్లేవని గుర్తించిన సమన్వయకర్తలను తొలగించి, సమర్థులుగా భావించిన వారిని నియమించింది. పనితీరు బాగా లేని ఎమ్మెల్యేల స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించింది. మరికొందరు ఎమ్మెల్యేలను ఇతర నియోజకవర్గాలకు మార్చి, వారి స్థానంలో కొత్తవారిని నియమించింది.

మార్పులతో తంటాలు

విశాఖ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న అక్కరమాని విజయనిర్మలకు ప్రజల్లో పెద్దగా ఆదరణ లేదనే కారణంతో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను సమన్వయకర్తగా వైసీపీ నియమించింది. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పనితీరు సరిగా లేదంటూ కార్పొరేటర్ ఉరుకూటి రామచంద్రరావును నియమించింది. దీనిపై ఎమ్మెల్యే నాగిరెడ్డి అభ్యంతరం వ్యక్తంచేయడంతో పాటు ఉరుకూటికి తప్ప మరెవరికి అవకాశం ఇచ్చినా అభ్యంతరం లేదని బాహాటంగానే స్పష్టం చేశారు. నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో సమన్వయకర్తగా ఉన్నంతమాత్రాన పార్టీ టికెట్ ఖరారైనట్టు కాదని ఎమ్మెల్యే వ్యాఖ్యానిస్తుండడం ద్వితీయ శ్రేణి నేతలను, కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నది.

అనకాపల్లి ఎమ్మెల్యే, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కాదని పార్టీ అధిష్ఠానం నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌ను నియమించింది. తానే అభ్యర్థినంటూ ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తూ సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. కాగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ని మార్చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అతని స్థానంలో పలువురి పేర్లు తెర మీదకి వస్తున్నాయి. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి నియోజకవర్గంలో అసమ్మతిపోరు ఎక్కువైంది. పార్టీలోని కొంతమంది నేతలు, కార్యకర్తలు ధర్మశ్రీకి టికెట్ ఇవ్వొద్దంటూ మీడియా సమావేశాలు పెట్టి మరీ స్పష్టం చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ఎమ్మెల్యేగా శెట్టి ఫాల్గుణ ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ నియోజకవర్గం సమన్వయకర్తగా ఎంపీ గొడ్డేటి మాధవిని నియమించారు. దీనిపై మండల స్థాయి నేతలు, కార్యకర్తల నుంచి వ్యతిరేకత రావడంతో పార్టీ పెద్దలు ఆమె (మాధవి) స్థానంలో హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగాన మత్స్యలింగంని నియమించారు. పాడేరు ఎమ్మెల్యేగా కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఉండగా.. నియోజకవర్గ సమన్వయకర్తగా మత్స్యరాస విశ్వేశ్వరరాజును నియమించారు.

వైవీ వ్యాఖ్యలతో కలకలం

ఇదిలావుండగా కొత్తగా సమన్వయకర్తలుగా నియమితులైన వారికి, సిట్టింగ్ ఎమ్మెల్యేలే సమన్వయకర్తలుగా ఉన్న వారికి వచ్చే ఎన్నికల్లో టికెట్ ఖాయమనే భావన కార్యకర్తల్లో ఉంది. వారంతా తమ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తామే అభ్యర్థులమనే నమ్మకంతో ఎన్నికల ప్రచారం కూడా చేసుకుంటున్నారు. ఈ తరుణంలో ... మిగతా 8వ పేజీలో

అటకెక్కిన మినీ రిజర్వాయర్

ఐదేళ్ల నుంచి కదలిక లేని విజయరామసాగరం ప్రాజెక్టు పనులు

- పట్టించుకోని ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఇరిగేషన్ అధికారులు
- ప్రాజెక్టు పూర్తయితే 1,500 ఎకరాలకు సాగునీరు

సబ్బవరం, ఫిబ్రవరి 25:

మండలంలో నల్లరేగులపాలెం రెవెన్యూ పరిధిలోని విజయరామసాగరం సాగునీటి చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేసే పనులు ఐదేళ్ల నుంచి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా వున్నాయి. సుమారు రెండు దశాబ్దాల క్రితం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టగా, తరువాత పదేళ్లపాటు అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసింది. పదేళ్ల క్రితం మళ్లీ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అంచనాలను సవరించి పనులు మొదలుపెట్టారు. అయితే రెండేళ్లపాటు వరదలు రావడంతో చెరువులో పూడిక అధికంగా చేరడంతో టెండర్ గిట్టుబాటు కాదంటూ కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు ఆపేశారు. ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించింది.





విజయరామసాగరం మినీ రిజర్వాయర్ ప్రస్తుత పరిస్థితి

మండలంలో నల్లరేగులపాలెం రెవెన్యూ పరిధిలోని విజయరామసాగరం సాగునీటి చెరువు 37 ఎకరాల విస్తీర్ణం వుంది. దీనిచుట్టూ కొండలు ఉండడంతో వర్షాకాలం అరంభంలోనే పుష్కలంగా నీరు చేరుతుంది. తరువాత వచ్చే నీరంతా వృథాగా దిగువకు పోతున్నది. విజయరామసాగరం చెరువును మినీ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే సబ్బవరం మండలం నల్లరేగులపాలెం, నారపాడు, బాటజంగాలపాలెం, అనకాపల్లి మండలంలో పాపయ్యసంతపాలెం, కొండుపాలెం, చింతనిప్పులఅగ్రహారం తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని సాగునీటి చెరువులను నింపడం ద్వారా 1500 ఎకరాలకు సాగునీరు అందిచవచ్చని 2003లో అప్పటి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భావించారు. నీటిపారుదల శాఖ అధికారులతో అంచనాలు తయారు చేయించారు. చెరువుకు ఎగువున డి.పట్టా భూములు, రైతుల ఆక్రమణలో వున్న ప్రభుత్వ భూములు దాదాపు వంద ఎకరాలను సేకరించి, అటవీ శాఖ భూములు కలుపుకొని దాదాపు 300 ఎకరాల విస్తీర్ణంలో మినీ రిజర్వాయర్ నిర్మించవచ్చని అధికారులు నివేదించారు. నాటి సీఎం చంద్రబాబునాయుడును ఒప్పించి, విశాఖ డెయిరీ నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభించే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మినీ రిజర్వాయర్ నిర్మాణాన్ని పక్కన పెట్టేసింది. 2014 వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. తరువాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టుకు మళ్లీ కదలిక వచ్చింది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, సీఎం చంద్రబాబుతో మాట్లాడి, నీరు-చెట్టు పథకం కింద రూ.3.2 కోట్లు మంజూరయ్యేలా కృషి చేశారు. 2016 డిసెంబరు 13న అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు, ఎంపీ ముత్తంశెట్టి, ఎమ్మెల్యే బండారు.. మినీ రిజర్వాయర్‌కు కేటాయించి భూమిలో పూడికతీత పనులను శ్రీకారం చుట్టారు. అయితే వరుసగా రెండేళ్లపాటు (2017, 2018) అధిక వర్షాలు కురిసి, మినీ రిజర్వాయర్ పనులు చేపట్టిన ప్రదేశంలోకి భారీగా వరద నీటితోపాటు పూడిక చేరింది. దీంతో రిజర్వాయర్ ఏర్పాటు పనులకు ఆటంకం కలిగింది. అప్పటికి ... మిగతా 8వ పేజీలో



2017 మార్చిలో యంత్రాలతో పూడిక తీత పనులు నిర్వహిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) జయరామసాగరం మినీ రిజర్వాయర్ నిర్మాణానికి 2016లో పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాటి మంత్రి అయ్యన్న పాత్రుడు (ఫైల్ ఫొటో)

చైతన్యంతో ఓటు వేయండి

భవిష్యత్తు తరాల కోసం మంచి పాలకులను ఎన్నుకోవాలి

సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ





సమావేశంలో మాట్లాడుతున్న సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25:

భవిష్యత్తు తరాల కోసం మంచి పాలకులను ఎన్నుకోవాలని రిటైర్డ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ సూచించారు. ఆదివారం రాత్రి స్థానిక వీవీ రమణ రైతుభారతి హాల్‌లో 'ఓటు వేద్దాం- ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే అంశంపై జరిగిన రాష్ట్ర స్థాయి కళాజాత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటు వేసే విషయంలో ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. ప్రజాహితం, భవిష్యత్తు కోసం ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాసమస్యలు పరిష్కరించే వారిని, నిజాయతీపరులను ఎన్నుకోవాలని సూచించారు. సమాజం కోసం పనిచేసే వారు ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటారని ఇందుకు రాజ్యసభ మాజీ సభ్యుడు వీవీ రమణ ఒక ఉదాహరణ అని చెప్పారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న ఆయనను పార్టీలకు అతీతంగా రాజ్యసభకు పంపడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం రాజ్యసభ సీటు చాలా ఖరీదుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తన స్వగ్రామంలో ఓటు నమోదుకు మూడేళ్ల సమయం పట్టిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఏపీ టైటిలింగ్ చట్టం గురించి అందరూ తెలుసుకోవాని, ఈ చట్టం వల్ల వారసత్వంగా వచ్చిన ఆస్తిని కూడా సొంతం చేసుకోలేని పరిస్థితులు ఉంటాయన్నారు.

అంతేకాకుండా మనకు వారసత్వంగా సంక్రమించిన ఆస్తి కూడా రెవెన్యూ అధికారులు నిర్ధారించాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. ఇది దుర్మార్గమైన చట్టమని ఆయన పేర్కొన్నారు. తాను నర్సీపట్నంలో సబ్‌కలెక్టర్‌గా పనిచేసినప్పుడు ప్రజల కోసం పోటీపడి పనిచేసేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించేలా ప్రజలు చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు.

సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్యం ధనస్వామ్యంగా మారిందన్నారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ విల్లూరి పైడారావు మాట్లాడుతూ, ఓటు విలువ ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పి.హరిప్రకాశ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట వైసీపీలో ముదిరిన వర్గపోరు

విశాఖ డెయిరీలో ఇరువర్గాలతో మంత్రి, చైర్మన్ సమావేశం

- పరస్పరం మాటల యుద్ధం
- ధర్మశ్రీ వ్యతిరేక వర్గంపై అనుకూల వర్గం దాడి?
- పోలీసుల జోక్యంతో సర్దుబాటు

చోడవరం/ అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 25:

చోడవరం నియోజకవర్గం పరిధిలోని బుచ్చెయ్యపేట వైసీపీ మండల అధ్యక్షుడిని మార్చడంపై ఆదివారం విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం రసాభాసగా మారింది. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి వ్యతిరేకంగా ఆరోపణలు చేసిన వైసీపీ మండల మాజీ అధ్యక్షుడితోపాటు అదే మండలానికి చెందిన విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, తదితరులు ఈ సమావేశానికి హాజరైనట్టు తెలిసింది. ఈ సందర్భంగా మంత్రి అమర్, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ల సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా ధర్మశ్రీ వర్గానికి చెందిన దొండా రాంబాబు వర్గీయులు దాడికి ప్రయత్నించినట్టు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు డెయిరీకి చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపివేశారు.

బుచ్చెయ్యపేట మండలానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు రెండు రోజుల క్రితం మీడియా సమావేశం ... మిగతా 8వ పేజీలో

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు



అనకాపల్లిలోని ఓ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళుతున్న అభ్యర్థులు

గందరగోళంగా పరీక్ష ప్రశ్నాపత్రం

- ఇండియన్ సొసైటీలో కఠినంగా ప్రశ్నలు
- జాగ్రఫీలో అవుటాఫ్ సిలబస్
- సుదీర్ఘంగా మెంటల్ ఎబిలిటీ ప్రశ్నలు
- కటాఫ్ మార్కులు తగ్గుతాయని అభ్యర్థుల ఆవేదన
- ఏయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో వసతులు మృగ్యం
- పలుచోట్ల తాగునీరు కూడా అందుబాటులో ఉంచని యంత్రాంగం

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్ర్కీనింగ్ టెస్ట్) ప్రశ్నపత్రం అత్యంత కఠినంగా ఇవ్వడంతో అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నెలల తరబడి కోచింగ్ తీసుకున్నా జవాబులు రాసేందుకు సమయం సరిపోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్‌కు అర్హతసాధించే విషయంలో కటాఫ్ మార్కులు తగ్గుతాయని, ఎక్కువ మంది స్ర్కీనింగ్ పరీక్షలో ఫెయిలవుతారని అంటున్నారు.

అంతా గందరగోళం

స్ర్కీనింగ్ పరీక్షలో 150 మార్కులకు ప్రశ్నపత్రం ఇచ్చారు. ఇందులో చరిత్ర 30, జాగ్రఫీ 30, ఇండియన్ సొసైటీ 30, మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, రీజనింగ్ 30, కరెంట్ అఫైర్స్ అండ్ జీకే 30 మార్కులకు ప్రశ్నలున్నాయి. మొత్తం 150 ప్రశ్నలకు 150 నిమిషాల్లో జవాబులు రాయాలి. చరిత్రకు సంబంధించి ప్రశ్నలు సులువుగా ఉన్నాయి. జాగ్రఫీలో కొన్ని ప్రశ్నలు ఏపీపీఎస్సీ సిలబస్‌కు సంబంధంలేనివి ఇవ్వడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. ఇండియన్ సొసైటీ అనేది కొత్తగా ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన మెటీరియల్ కొద్దిరోజుల క్రితమే తెలుగు అకాడమీ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో ఎక్కువగా సోషియాలజీ, న్యాయ సంబంధమైన సెక్షన్లు, రాజ్యాంగ సవరణలపై ప్రశ్నలు ఇచ్చారు. సాధారణంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలలోనే ఇటువంటి ప్రశ్నలు వస్తాయని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. మెంటల్ ఎబిలిటీ, అర్థమెటిక్, రీజనింగ్‌లో కొన్ని ప్రశ్నలకు విద్యార్థులు కాలిక్యులేటర్ లేకుండా జవాబులు రాయడం సాధ్యంకాదని ఏయూలో పరీక్ష రాసిన మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ ఆప్షన్‌గా గణితం తీసుకున్న వారు కూడా ఒక ప్రశ్నకు నిమిషంలో జవాబు రాయలేరన్నారు. కరెంట్ అఫైర్స్‌లో ప్రస్తుత పరిస్థితులపై కాకుండా చరిత్రపై ప్రశ్నలు ఇవ్వడం దారుణమన్నారు. ఇదిలా వుండగా పరీక్షకు సంబంధించి తెలుగు అకాడమీ ప్రామాణికమైన పుస్తకాలు అందుబాటులో లేవని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసినా ఫలితం కనిపించలేదని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ వాపోయారు. పరీక్ష నెల రోజులు వాయిదా వేసి మెటీరియల్ అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

అభ్యర్థులకు ఇక్కట్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్ష రాసిన అభ్యర్థులకు అక్కడ నిర్వాహకులు పలు ఆంక్షలు విధించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తమతోపాటు తీసుకువచ్చిన బ్యాగులను లోనికి అనుమతించలేదు. దీంతో కళాశాలకు ఎదురుగా ఉన్న టీ దుకాణంలో పెట్టుకోవాలని పోలీసులు సూచించారు. పరీక్ష రాసిన తరువాత వచ్చిన అభ్యర్థుల నుంచి టీ దుకాణం యజమాని ఒక్కో బ్యాగుకు రూ.30 చొప్పున వసూలు చేశారు. అంతేకాకుండా బ్యాగులు తిరిగి ఇచ్చే సమయంలో గందరగోళం నెలకొనడంతో పోలీసులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ నిర్వాకంతో తీవ్ర ఇబ్బందులు పడ్డామని పలువురు ఆరోపించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు రాసిన అభ్యర్థులకు కనీసం తాగునీటి సదుపాయం కల్పించలేదు. అభ్యర్థులు పదేపదే కోరితే ఇన్విజిలేటర్లు తాము తెచ్చుకున్న వాటర్ బాటిల్స్‌ను అభ్యర్థులకు ఇచ్చారు.

ఇదిలావుండగా విశాఖ జిల్లాలో మొత్తం 105 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 47,491 మందికి అభ్యర్థులకు గాను 39,300 (82.75 శాతం) మంది హాజరయ్యారు. అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం కేంద్రాల్లో 10,627 మంది అభ్యర్థులకుగాను 9,060 మంది (85.25 శాతం) పరీక్షకు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, జేసీ

విశాఖలో ఆదివారం ... మిగతా 8వ పేజీలో

ఉపమాక క్షేత్రంపై టీటీడీ నిర్లక్ష్యం

- అభివృద్ధి లేదు సరే.. ఉత్సవాలైనా చేయరా?
- ఆలయ ఇన్‌స్పెక్టర్‌ను నిలదీసిన గ్రామ పెద్దలు

నక్కపల్లి, ఫిబ్రవరి 25:

ఉపమాక క్షేత్రాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ) అభివృద్ధి చేస్తుందని గతంలో అధికారులు చేసిన ప్రకటనలు, భక్తుల ఆశలు భ్రమగానే మిగిలిపోయాయని, కనీసం స్వామివారి ఉత్సవాలు, సేవలు కూడా చేయలేకపోతే ఎలా అని టీటీడీ అధికారులపై ఉపమాక గ్రామస్థులు, పెద్దలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉపమాక ఆలయం విషయంలో టీటీడీ అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆగ్రహించారు. ఆదివారం ఉపమాక క్షేత్రంలో స్వామివారి పెండ్లి రాటోత్సవం సందర్భంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును నిలదీశారు. ఏడాది నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు, ధనుర్మాసోత్సవాలు చేయలేక టీటీడీ చేతులెత్తేస్తే, దాతల ... మిగతా 8వ పేజీలో



ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును నిలదీస్తున్న పెద్దలు

క్రైం... crime news

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నర్సీపట్నం, ఫిబ్రవరి 25: నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో నెల్లిమెట్ట దాటిన తరువాత బైక్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. లంబసింగి సమీపంలోని చిట్టాలగొప్పి గ్రామానికి చెందిన బి.నాగరాజు(55) నర్సీపట్నం మండలం వేములపూడిలోని బంధువుల ఇంటికి బైక్‌పై వస్తున్నాడు. నెల్లిమెట్ట సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద అతని బైక్‌ను కారు ఢీకొనడంతో నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని హుటాహుటిన నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి : ఇద్దరి అరెస్టు

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 25: మండల కేంద్రం ఎస్.రాయవరం గ్రామ సమీపంలోని శ్మశాన వాటికలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై ఆదివారం దాడి చేసి, ఇద్దరి వ్యక్తులను అరెస్టు చేసి, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. కోడి పందెలు ఆడుతున్నట్టు అందిన సమాచారంతో ఆ ప్రదేశానికి వెళ్లి దాడి చేశామని ఎస్ఐ చెప్పారు.

10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, ఫిబ్రవరి 25: మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో విక్రయించేందుకు తీసుకువెళుతున్న 10 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం తమకు వచ్చిన సమాచారం మేరకు కన్నూరు నాయుడు అనే వ్యక్తి తీసుకువస్తున్న బ్యాగును తనిఖీ చేయగా, బ్యాగులో మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

30 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, ఫిబ్రవరి 25: పరవాడ గ్రామానికి చెందిన చింతాడ శివసాయిని 30 మద్యం బాటిళ్లతో ఆదివారం రాత్రి పట్టుకున్నట్టు పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో వీటిని కొనుగోలు చేసి తీసుకువెళుతున్న క్రమంలో తనిఖీ చేయగా పట్టుబడినట్టు చెప్పారు. ఈ మేరకు నిందితుడు శివసాయిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ చోరీ

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25: లింగభూపాలపుర అగ్రహారంలో శనివారం రాత్రి ఓ ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్ అపహరణకు గురైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. లింగభూపాలపుర అగ్రహారానికి చెందిన నక్క నర్సింహమూర్తి రెండు నెలల క్రితం ఓ బైక్‌ను కొనుగోలు చేశారు. ఎప్పటిలాగానే శనివారం రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేశారు. ఆదివారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. చోరీకి గురైనట్టు గుర్తించి బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మినుము పైరుపై తెగుళ్ల దాడి



కొమిరలో బూడిద తెగులు సోకిన మినుము పంట



చినపాచిలలో ఎండిపోతున్న మినుము మొక్కలు

» ఆందోళన చెందుతున్న రైతులు

రావికమతం, ఫిబ్రవరి 25: మండలంలోని కొమిర, మత్స్యపురం, చినపాచిల, కేబీపీ అగ్రహారం, బుడ్డిబంద, కవ్వగుంట, గర్నికం, మేడివాడ, మట్టవానిపాలెం, గొల్లలపాలెం, గంపవానిపాలె తదితర గ్రామాల్లో గత ఖరీఫ్‌లో వరి సాగు చేసిన భూముల్లో రైతులు రబీ పంటగా మినుము వేశారు. అయితే ప్రస్తుతం పూత, పిందె దశల్లో వున్న మినుము పైరుపై తెగుళ్ల దాడి చేస్తున్నాయి. కొద్ది రోజుల నుంచి రాత్రి పూట మంచు దట్టంగా కురవడం, పగలు ఎండ అధికంగా కాస్తుండడంతో బూడిద తెగులు, లద్దె పురుగులు మినుము పంటను ఆశించి నష్టపరుస్తున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త సౌజన్య.. మినుము పంటను ఆశించిన తెగుళ్ల, వాటి నివారణ చర్యల గురించి వివరించారు.

బూడిద తెగులు: విత్తన శుద్ధి చేయకపోవడం వల్ల ఈ తెగులు ఆశించే అవకాశం వుంది. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు ముదురు ఆకులపై బూడిద రూపంలో చిన్న మచ్చలు ఏర్పడతాయి. ఇవి క్రమేణా పెద్దవై ఆకులపైన, కింద భాగాలకు, కొమ్మలు, కాయలకు వ్యాపిస్తాయి. దీంతో ఆకులు తెల్లగా మారిపోయి పూత, పిందెలు రాలి పోతాయి. ఈ తెగులును త్వరగా అరికట్టకపోతే పొలం అంతటికీ త్వరగా వ్యాపించి తీవ్ర నష్టం కలిగిస్తుంది. బూడిద తెగులు నివారణకు ఒక లీటరు నీటికి ఒక గ్రాము కార్బండిజిమ్/థయోఫానేట్ మిథైల్/ ఒక మి.లీ. కెరాథేన్/ రెండు మి.లీ. హెక్సాకొనజోల్.. వీటిల్లో ఏదో ఒకదానిని కలిపి 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి

పొగాకు లద్దె పురుగు: పొగాకు లద్దె పురుగు ఆశించిన పొలాల్లో మినుము మొక్కల ఆకులు గూడు కట్టి వుంటాయి. దీనిని విప్పితే పురుగులు కనిపిస్తాయి. పొగాకు లద్దె పురుగులు మినుము ఆకుల రసం పీల్చివేస్తాయి. దీంతో ఆకులు తెల్లగా మారి పూత, పిందె ఎండిపోతాయి. పైరుపై పొగాకు లద్దెపురుగు లక్షణాలు కనిపించిన వెంటనే ఇవి ఆశించిన మొక్కలను పీకివేసి కాల్చివేయాలి. అనంతరం క్లోరీపైరీఫాస్ లేదా మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి 1.6 ఎం.ఎల్. చొప్పున కలిపి ఆకులన్నీ తడిచేలా పిచికారీ చేయాలి. అలాగే ఐదు కిలోల తవుడులో అర కిలో బెల్లం, అర లీటర్ మోనోక్రోటోఫాస్ మందు కలిపి చిన్నచిన్న ఉండలుగా చేసి తెగులు ఉన్న ప్రదేశాల్లో వేయాలి. రాత్రిపూట పొగాకు లద్దె పురులు ఈ ఉండలను తిని చనిపోతాయి.

అబ్బురపరిచిన సీ ఫేజ్ విన్యాసాలు

» నౌకదళ శక్తి సామర్థ్యాలను తెలియజేసేలా నిర్వహణ



విన్యాసాల్లో పాల్గొన్న హెలికాప్టర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): మిలాన్-2024లో భాగంగా సముద్రంలో ఆదివారం విన్యాసాలు కొనసాగాయి. ఈ విన్యాసాల్లో భారత్‌తో పాటు మిత్రదేశాలకు చెందిన నేవీ భాగస్వామ్యమయ్యాయి. ఆయా దేశాలకు చెందిన నౌకలు, యుద్ధ విమానాలు, హెలికాఫ్టర్లు విన్యాసాల్లో పాల్గొన్నాయి. నౌకాదళ శక్తి, సామర్థ్యాలను తెలియజేసేలా సాగాయి. ఉపరితలంలోనే లక్ష్యాలను చేధించడం, వైమానిక లక్ష్యాలకు వ్యతిరేకంగా ఆయుధ కాల్పులు, జలాంతర్గాముల లక్ష్యాలను తిప్పికొట్టే రీతిలో సాగించిన విన్యాసాలు నేవీ సామర్థ్యాన్ని తెలియజేశాయి. భారత్‌తోపాటు మిత్ర దేశాల ఆధ్వర్యంలో సముద్రంలో సాగిస్తున్న విన్యాసాలతో ఒకరకంగా యుద్ధ వాతావరణం కనిపించింది. సముద్ర సామర్థ్యాలను, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించుకునేందుకు అనుగుణంగా విన్యాసాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 27 వరకు రెండో విడత సీ ఫేజ్ విన్యాసాలు కొనసాగనున్నాయి.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష

» కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ
» గవరపాలెం హైస్కూల్‌లో ఇద్దరికి అనుమతి నిరాకరణ



నర్సీపట్నంలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



అనకాపల్లిలో శ్రీచైతన్య పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25: అనకాపల్లి పట్టణంలో ఆదివారం గ్రూప్-2 స్క్రీనింగ్ టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించారు. జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం, మాకవరపాలెం కేంద్రాల్లో 10,627 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. పరీక్షకు 9,060 మంది హాజరయ్యారు. జిల్లాలో 1,567 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. మొత్తం మీద హాజరు శాతం 85.25 ఉందని అధికారులు ప్రకటించారు. అనకాపల్లి పట్టణంలోని సంయుక్త, శ్రీకన్య, హిమశేఖర్, నారాయణ, భాష్యం, శ్రీచైతన్య విద్యాసంస్థలతో పాటు జీవీఎంసీ గవరపాలెం హైస్కూల్, పట్టణ బాలికోన్నత పాఠశాల, గాంధీనగరం హైస్కూల్, ఏఎంఏఎల్ హైస్కూల్, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కాలేజీ, తుమ్మపాల జడ్పీ హైస్కూల్‌ల్లో అభ్యర్థులు పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తనిఖీలు చేశారు. అయితే గవరపాలెం ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద ఇద్దరిని నిర్వాహకులు అనుమతించలేదు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన రమణ అనే అభ్యర్థి ఒరిజినల్ గుర్తింపు కార్డులు తీసుకురాకపోవడంతో అనుమతించలేదు. అలాగే చింతపల్లి ప్రాంతానికి చెందిన కె.లక్ష్మి ఆలస్యంగా రావడంతో ఆమెను కూడా పరీక్ష రాసేందుకు లోపలికి అనుమతించలేదు. ఉదయం 10.15 గంటలకు పరీక్ష నిర్వాహకులు పోలీసులతో ప్రధాన గేటుకు తాళాలు వేయించారు. అయితే లక్ష్మి 10.22 గంటల సమయంలో రావడంతో ఆమెను కూడా పరీక్షకు అధికారులు అనుమతించలేదు. దీంతో గేటు ముందే కన్నీరు పెట్టుకుంది. పోలీసులు ఆమెను ఓదార్చారు. అన్ని కేంద్రాల వద్ద అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు.

నర్సీపట్నంలో..

నర్సీపట్నం: నర్సీపట్నం, వేములపూడిలోని తొమ్మిది కేంద్రాల్లో మొత్తం 2500 మంది అభ్యర్థులు హాజరయ్యారని ఆర్డీవో హెచ్‌వీ జయరాం తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద అధికారులు పక్కా ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు పెట్టి ఇతరులను పరీక్షా కేంద్రాల వద్దకు అనుమతించలేదు. విద్యార్థులు ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. పోలీసులు పరీక్ష అట్టలు, ఫోన్లు, బ్లూటూత్‌లు, స్మార్ట్ వాచ్‌లను అనుమతించలేదు. ఆర్డీవో జయరాం, డీఎస్పీ బి.వెంకట్రామయ్య, అదనపు ఎస్పీ విజయ్ కుమార్ పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలు ప్రశాంతంగా జరగడానికి చర్యలు తీసుకున్నారు.



అనకాపల్లి గాంధీనగరం జీవీఎంసీ పరీక్షా కేంద్రం నుంచి బయటకు వస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అందరినీ కలుపుకొని పనిచేస్తా

» జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల

కొత్తూరు (అనకాపల్లి), ఫిబ్రవరి 25: తన సేవలు శాసనసభ ద్వారా ప్రజలకు అందించాలన్న ఉద్దేశంతో జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా తన పేరు ప్రకటించారని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అన్నారు. ఆదివారం నూకాంబిక అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, జనసేన- తెలుగుదేశం పార్టీల అధిష్ఠానాల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరినీ కలుపుకొని పని చేస్తానని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావుతో, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావుతో ఇప్పటికే మాట్లాడానని, త్వరలో పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసి అందరినీ కలుపుకుని ముందుకు సాగుతానని చెప్పారు. టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఆయన విజయవాడలో ఉన్నట్టు తెలిసిందని, ఆయనతో కూడా మాట్లాడతానన్నారు. అందరినీ కలుపుకొని వెళ్లాలన్నదే తన ఆలోచన అని చెప్పారు.



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న కొణతాల రామకృష్ణ

అనకాపల్లి అభ్యర్థి ఎంపికపై చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్.. ఇద్దరూ కలిసి మాట్లాడుకున్న తరువాత తన పేరు ప్రకటించారని కొణతాల తెలిపారు. అంతకుముందు రాజుపాలెం సూర్యనారాయణ స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటా..

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, ఫిబ్రవరి 25: తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. 2013లో అనకాపల్లిలో తెలుగుదేశం పార్టీ సంక్షోభంలో ఉన్నప్పుడు హైదరాబాద్‌లో అధినేత చంద్రబాబునాయుడు తమకు ధైర్యం చెప్పి అంకితభావంతో పని చేయాలని సూచించారన్నారు. కోర్ కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని సూచించడంతో అట్టడుగు భాగం నుంచి పార్టీని బలోపేతం చేసుకొస్తూ 2014 ఎన్నికల్లో పీలా గోవింద సత్యనారాయణ గెలుపునకు కృషి చేశామన్నారు.

అలాగే పార్టీ కోసం కష్టపడిన విధానాన్ని గుర్తించిన నాయకత్వం ఎమ్మెల్సీ, జిల్లా అధ్యక్ష పదవులను కట్టబెట్టడం ఆనందదాయకమన్నారు. అయితే ఈ తరుణంలో గత ఐదేళ్లలో అధికార పార్టీ నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నామన్నారు. భవిష్యత్తులో టీడీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలి రైల్వే స్టేషన్‌కు మహర్దశ

» అమృత్ భారత్‌లో భాగంగా అభివృద్ధి » నేడు పలు పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

ఎలమంచిలి, ఫిబ్రవరి 25: అమృత్ భారత్‌లో భాగంగా ఎలమంచిలి రైల్వే స్టేషన్ అభివృద్ధికి నోచుకోనున్నది. ఇప్పటికే పూర్తయిన పనులతో పాటు మిగిలిన పనులను సోమవారం ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఎలమంచిలి రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులు హాజరుకానున్నట్టు తెలిపారు. మండలంలోని ములకలాపల్లి, తురంగలపాలెం వద్ద నిర్మించిన రైల్వే అండర్‌పాస్‌లను ప్రారంభించనున్నారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో సుమారు 10 కోట్ల రూపాయల వ్యయంతో ప్లాట్‌ఫారం అభివృద్ధి పనులు, ప్రయాణికుల వెయిటింగ్ హాలు, అదనపు షెల్టర్ల నిర్మాణం, సర్క్యులేటింగ్ ఏరియా అభివృద్ధి, తదితర అభివృద్ధి పనులకు భూమిపూజ జరుగుతుందని తెలిపారు.



ఎలమంచిలి రైల్వే స్టేషన్ (ఇన్‌సెట్‌లో) ప్రధాని ప్రారంభించనున్న తురంగలపాలెం వద్ద నిర్మించిన అండర్‌పాస్ వే

ఆరోగ్యశాఖ ఉద్యోగులకు వేతనాలేవీ?

» మరో మూడు రోజుల్లో ముగియనున్న ఫిబ్రవరి
» కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మూడు వేల మందికి నిరాశ
» ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో ఉద్యోగుల్లో ఆందోళన

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న రెండు వేల మందికిపైగా ఉద్యోగులకు జనవరి నెల వేతనాలు ఇంకా అందలేదు.

ఈ నెల రెండు, మూడు తేదీల్లో చెల్లించాల్సిన ఉన్నప్పటికీ నెలాఖరు వచ్చినా జమ కాకపోవడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగుల్లో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మాసిస్టులు, సెకండ్ ఏఎన్ఎంలు ఉన్నారు. వీరిలో గరిష్ఠంగా రూ.90 వేల నుంచి కనిష్ఠంగా రూ.15 వేలు వరకు వేతనాలు తీసుకునే వారున్నారు. సకాలంలో చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొద్ది నెలలుగా చెల్లింపులు ఆలస్యమవుతున్నాయంటున్నారు. గత నెలలో పది రోజులు ఆలస్యమయ్యాయని, ఫిబ్రవరి చివరి వారం వచ్చినా జమ కాలేదని, ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదంటున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా..

నగర పరిధిలోని కేజీహెచ్, విమ్స్‌తోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగులు పనిచేస్తున్నారు. వేతనాల జాప్యంపై అధికారులను ఉద్యోగులు కలిసి విన్నవిస్తున్నారు. సకాలంలో చెల్లించేలా చూడాలని కోరుతున్నారు. అధికారులు నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో వారంతా అసహనం వ్యక్తం చేస్తున్నారు. చాలీ, చాలని వేతనాలతో పనిచేస్తున్న ఎంతో మంది ఉద్యోగులున్నారని, చెల్లింపుల్లో జాప్యం కావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉద్యోగులు అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు.



ఉపమాక ఆలయంలో స్వామివారి పెండ్లి రాటోత్సవం

వైభవంగా ఉపమాక వెంకన్న పెండ్లి రాటోత్సవం

నక్కపల్లి, ఫిబ్రవరి 25: ఉపమాక క్షేత్రంలో స్వామివారి పెండ్లి రాటోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా జరిగింది. మార్చి 20 నుంచి 26 వరకూ స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించి ఆలయ ఆచార, వ్యవహారాల మేరకు ముందుగా పెండ్లి రాట వేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం ఉదయం కొండపైన, కింద ఆలయాల్లో వున్న స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం సమీపాన పెండ్లి రాటోత్సవాన్ని ప్రధానార్చకులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. పెండ్లి రాటకు పూజలు చేసి హారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, శ్రీవారి సేవకులు, నక్కపల్లి, ఉపమాక గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాఘ పౌర్ణమికి పీటీడీ ఆదాయం రూ.13.46 లక్షలు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25: మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలకు భక్తులు వెళ్లేందుకు పీటీడీ అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి బస్సులు ఏర్పాటు చేయడం వల్ల రూ.13.46 లక్షల ఆదాయం లభించింది. ఈ ఏడాది నర్సీపట్నం, అనకాపల్లి డిపోల నుంచి పూడిమడక, రేవుపోలవరం సముద్రతీర ప్రాంతాలకు 70 బస్సులు నడపగా ఈ ఆదాయం వచ్చింది. గతేడాది ఈ రెండు డిపోల నుంచి 72 బస్సులు నడపగా రూ.15.85 లక్షలు ఆదాయం లభించిందని పీటీడీ అధికారులు తెలిపారు. ఒక్క అనకాపల్లి డిపోలో గతేడాది 37 బస్సులు పూడిమడకకు నడపగా రూ.9.11 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది 35 బస్సులకు గాను రూ.8.16 లక్షలు ఆదాయం వచ్చింది. అదే నర్సీపట్నం డిపో నుంచి గతేడాది 35 బస్సులు రేవుపోలవరానికి నడపగా రూ.6.73 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది కూడా 35 బస్సులు నడపగా రూ.5.30 లక్షలు మాత్రమే ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు.

నర్సీపట్నం డీఎస్పీ వెంకటరామయ్య ఆకస్మిక బదిలీ



డీఎస్పీ వెంకటరామయ్య

నర్సీపట్నం, ఫిబ్రవరి 25: నర్సీపట్నం డీఎస్పీ బి.వెంకటరామయ్య ఆకస్మికంగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏసీబీ డీఎస్పీగా ఉన్న జీఆర్ఆర్ మోహన్‌కు నర్సీపట్నం డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ నెల 15న డీఎస్పీ వెంకటరామయ్య విధుల్లో చేరారు. విధుల్లో చేరిన పది రోజుల వ్యవధిలో రాష్ట్ర ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడం గమనార్హం. దీనిపై ఆయన వివరణ కోరగా పరిపాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం బదిలీ చేసిందని చెప్పారు.

సీనియర్ ఉమెన్ హాకీ జిల్లా జట్టు ఎంపిక రేపు

ఎలమంచిలి, ఫిబ్రవరి 25: స్థానిక రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు సీనియర్ ఉమెన్ జిల్లా హాకీ జట్టు ఎంపిక చేస్తామని జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ కొరారు నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ నుంచి జరగనున్న 14 వ సీనియర్ ఉమెన్ అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో పాల్గొనే జిల్లా టీమ్ ఎంపిక చేస్తామన్నారు. జిల్లా జట్టు ఎంపికకు హాజరయ్యే క్రీడాకారిణిలు 1995 సంవత్సరం నుంచి పుట్టిన వారు అర్హులన్నారు.

అందుబాటులోకి ఆహార ప్రయోగశాల

» జాతికి అంకితమిచ్చిన ప్రధాని మోదీ
» రూ.4.77 కోట్ల సీఎస్ఎస్ నిధులతో ఏర్పాటు



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ



ప్రయోగశాలను ప్రారంభిస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం జాతికి అంకితమిచ్చారు. పెదవాల్తేరు లోని ఈఎన్‌టీ ఆస్పత్రి పక్కన ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయో గశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలను ఆదివారం ఉదయం గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ ప్రారంభోత్సవం చేసి, జాతికి అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ వికసిత్‌భారత్‌లో భాగంగా ఈ తరహా ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. వర్చువల్ విధానంలో జరిగిన కార్యక్రమాన్ని జిల్లా నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున జ్యోతి ప్రజ్వలన చేసి, బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో రూ.4.77 కోట్లతో ఏర్పాటు చేసిన మైక్రో బయాలజీ ల్యాబ్‌ను ప్రధాని ప్రారంభించారన్నారు. ఈ ల్యాబ్ రాష్ట్రానికే గుండె లాంటి దన్నారు. డయేరియా, ఇతర సమస్య లు వచ్చినప్పుడు ఆహారం, నీటి నమూనాలను సేకరించి, ఎక్కువ సంఖ్యలో పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రయోగశాలకు త్వరలో 80 మంది సిబ్బం దిని రాష్ట్ర ప్రభుత్వం నియమించనుందన్నారు. విశాఖలో మైక్రో బయాలజీ ల్యాబ్ ఏర్పాటు చేసినందుకు, ప్రధానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎం డైరెక్టర్ పూర్ణచంద్రరరావు, ఎన్‌హెచ్‌ఎం డీడీ గణపతిరావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ డి.అచ్చెన్నాయుడు, ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ నందాజీ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నృసింహ యజ్ఞానికి భూమి పూజ

సింహాచలం, ఫిబ్రవరి 25 : లోకకల్యాణార్థం సింహాచలంలో ఫాల్గుణమాస బహుళ పక్ష విదియ నుంచి చతుర్వేద హవన పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మక యజ్ఞం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం సంప్రదాయ రీతిలో భూమి పూజ చేశారు. స్థానాచార్యులు డా.టిపి రాజగోపాల్ పర్యవేక్షణలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారథ్యంలో వాస్తుపురుష పూజ, భూమిపూజ చేశారు. అనంతరం హలానికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు సతీసమేతంగా కర్షణానికి (దున్నేందుకు) లాంఛనంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ యజ్ఞం నిర్వహణకు దాతల సహకారంతో మౌలిక వసతులను కల్పిస్తున్నామన్నారు. యజ్ఞంలో పాల్గొనేందుకు విధి విధానాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. కాగా అంతకు ముందు అశోక్ దంపతులు అంతరాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు అశోక్‌కు శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. భూమి పూజలో పాలకమండలి సభ్యులు ఈఈ డీజీ శ్రీనివాసరాజు, ఏఈఓ పి.నరసింగరావు పాల్గొన్నారు.

ప్రధాన డ్రైనేజీలో పారని మురుగు

- పూడిక తొలగించపోవడమే కారణం
- దోమల స్వైరవిహారంతో ఎలమంచిలి వాసుల ఇక్కట్లు
- పట్టించుకోని మునిసిపల్ పాలకులు, అధికారులు


డ్రైనేజీలో నిలిచిపోయిన మురుగు నీరు

ఎలమంచిలి, ఫిబ్రవరి 25 : పట్టణంలో ప్రధాన డ్రైనేజీలో మురుగు కదలకుండా నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నది. ఈ డ్రైనేజీ పట్ల పాలకులు గానీ, మునిసిపల్ అధికారులు గానీ శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోకపోవడంతో పట్టణ ప్రజలకు మురుగు కష్టాలు మాత్రం తప్పడం లేదు. కొత్తపేట కాలనీ వద్ద ప్రధాన డ్రైనేజీలో వ్యర్థాలు పేరుకుపోవడంతోపాటు ఏళ్ల తరబడి పూడిక తొలగించకపోవడంతో మురుగు నీరు వెళ్లడం లేదు. ఈ కాలువ దోమల ఆవాస కేంద్రంగా మారింది. తీవ్ర దుర్వాసన వెద్దజల్లుతుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కొత్తపేట, మిలట్రీ కాలనీ, లొట్లవీధి, గాంధీనగర్, బస్టాండ్ జంక్షన్ ప్రాంతాల్లోని ప్రజలకు రాత్రయితే దోమల వల్ల కంటి మీద కునుకు ఉండడం లేదు. దోమల తీవ్రత పెరిగిపోయి రాత్రి మాటెలా ఉన్నా పగలు కూడా ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఎదురవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మునిసిపల్ అధికారులు డ్రైనేజీలో పూర్తిస్థాయి పూడికతీత పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాత్రి విజిట్స్ చేయకపోతే శాఖాపరమైన చర్యలు

- డిప్యూటీ డీఈవో పి.అప్పారావు


కోటవురట్ల జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు ప్రశ్నలు వేస్తున్న డిప్యూటీ డీఈవో

కోటవురట్ల, ఫిబ్రవరి 25: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి సబ్జెక్టు టీచర్ రాత్రి పూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విధిగా విజిట్ చేయాలని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు సూచించారు. పదో తరగతి విద్యార్థులకు సెలవు దినాల్లో నిర్వహించే ప్రత్యేక తరగతులను ఆయన ఆదివారం కోటవురట్లలోని ప్రభుత్వ, జడ్పీ బాలికల హైస్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్స్‌తో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని సబ్జెక్టు టీచర్స్ రాత్రులు వారి ఇళ్లకు వెళ్లి చదువుతున్నారో.. లేదో.. పర్యవేక్షించాలన్నారు. పిల్లలను చదివించాలని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మమేకమైతే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. టీచర్స్ రాత్రులు విజిట్‌లు చేయకపోతే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 397 పాఠశాల్లో పదో తరగతి పరీక్షలకు 21,259 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు డిప్యూటీ డీఈవో అప్పారావు చెప్పారు. పరీక్షల నిర్వహణకు 108 కేంద్రాలను ఏర్పాటు చేశామని, సెంటర్లలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు చర్యలుతీసుకుంటున్నామన్నారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో టీచర్స్ ఆనందరాజ్, పి. డేవిడ్, శ్రీదేవి, ప్రతాప్‌కుమార్ తదితరులు తరగతులు నిర్వహించారు.


ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న బండారు సత్యనారాయణమూర్తి

క్రీడలతో మానసిక ఉల్లాసం : బండారు

పరవాడ, ఫిబ్రవరి 25 : క్రీడల ద్వారానే మానసిక ఉల్లాసం పొందవచ్చునని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి పండగ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సెలంబం పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం బండారు మాట్లాడుతూ పండగ సందర్భంగా ఇటువంటి పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు ఆదివారం రాత్రి పరవాడ సీఐ బాలసూర్యారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, స్థానిక నాయకులు బురద అప్పలరాజు, కూండ్రపు తాతాజీ, కూండ్రపు శ్రీనివాసరావు, వియ్యపు చిన్న, కోచ్‌లు గొర్లె పుష్పారావు, నూకరాజు, తులసీరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రజా పోరుయాత్ర

రాంబిల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని రాంబిల్లి, కొత్తపట్నం, వాడనర్సాపురం, గోవిందపాలెం గ్రామాల్లో ఆదివారం బీజేపీ నాయకులు ప్రజా పోరుయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు, ప్రజాపోరుయాత్ర జిల్లా కన్వీనర్ ఈర్లె శ్రీరామమూర్తి సమాచార ప్రతులు, మోదీ క్యాలండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇస్తున్న పథకాలను తమ సొంత పథకాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం బాధాకరమన్నారు. ఎలమంచిలి నియోజకవర్గంలో తమ పార్టీ తరఫున వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసి నాయుడు, అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ బీవీఎస్.వర్మ, పార్టీ మండల అధ్యక్షుడు కారే రాముడు, ప్రోగ్రాం కన్వీనర్ అగ్గాల హనుమంతరావు, కో-కన్వీనర్లు ధర్మాల గోవిందరెడ్డి, ఎం.కాళేశ్వరరావు, ఇబ్రహీం భాషా ఉన్నారు.


బీజేపీ ప్రజాపోరుయాత్ర కార్యక్రమంలో శ్రీరామమూర్తి

ఏఎంఏఎల్ కళాశాల ఉన్నతికి రూ.4లక్షలు విరాళం

కొత్తూరు, ఫిబ్రవరి 25: స్థానిక ఏఎంఏఎల్ కళాశాల ఉన్నతికి 1982-1985లో బీఎస్సీ కెమిస్ట్రీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ పి. భీమేశ్వరరావు రూ.4లక్షలు విరాళం అందజేశారు. కళాశాలను భీమేశ్వరరావు కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలుమ్ని అధ్యక్షుడు బొడ్డేడ అప్పారావు, కార్యదర్శి పెనుమత్స కృష్ణంరాజుల ఆధ్వర్యంలో ఆ చెక్కును కళాశాల యాజమాన్యానికి అందజేశారు. అనంతరం కళాశాల ప్రాంగణమంతా తిరిగి కళాశాలలో మంచి సెమినార్ హాలు కట్టించేందుకు తగిన ప్లాన్ వేయించి పంపితే నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాడి శ్రీనివాసరావు, ఆలుమ్ని ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భీమేశ్వరరావు దంపతులను సత్కరించారు.


చెక్కును కళాశాల యాజమాన్యానికి అందజేస్తున్న భీమేశ్వరరావు దంపతులు

రామచంద్రమ్మ అమ్మవారి పండుగ రేపు

పరవాడ, ఫిబ్రవరి 25: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన వాడచీపురుపల్లి రామచంద్రమ్మ అమ్మవారి పండుగ మంగళవారం జరగనుంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. వాడచీపురుపల్లి గ్రామమంతా విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. పోలిపల్లి జంక్షన్ నుంచి అమ్మవారి ఆలయం వరకు నాలుగు కిలోమీటర్ల మేర విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. పండుగ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. సుమారు 90వేల మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారన్న అంచనాతో భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. దర్శనానికి బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు. పండగ ఏర్పాట్లను మాజీ ఎంపీపీ, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మాసవరపు అప్పలనాయుడు ఆదివారం పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాలసూర్యారావు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను కలవరపాటుకి గురిచేశాయి. అంతేకాకుండా ప్రస్తుత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలపై అసమ్మతి వున్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. దీంతో టికెట్ ఎవరికి వస్తుందో తెలియక నేతలు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతుండగా... అభ్యర్థులు ఎవరన్న దానిపై స్పష్టత లేక వైసీపీ శ్రేణులు నిరుత్సాహంలో కూరుకుపోయాయి.

అటకెక్కిన మినీ రిజర్వాయర్

... 5వ పేజీ తరువాయి

సుమారు రూ.1.5 కోట్ల విలువ చేసే పూడికతీత పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా స్లూయిస్, కాలువలు, కలింగల పనులు చేయాల్సి వుంది. అయితే భారీ వర్షాలకు పూడిక పేరుకుపోవడంతో పాత టెండర్ మేరకు పనులు చేయడం సాధ్యం కాదని కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. అంచనాలను సవరించి, కొత్త ప్రతిపాదనలు తయారు చేసే తరుణంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల నుంచి స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జలవనరుల శాఖ అధికారులు దీని గురించి పట్టించుకోవడంలేదు.

ఉపమాక క్షేత్రంపై టీటీడీ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సహకారంతో చేయాల్సి వచ్చిందని ఆలయ మాజీ ఛైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక ఇన్‌చార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, సున్న కాశీ, వైసీపీ నేతలు సిద్దాబత్తుల కృష్ణ, నూకతాత ఆవేదన వెలిబుచ్చారు. కొవిడ్-19 తరువాత నుంచి నిత్యాన్నదానం కూడా టీటీడీ నిలిపివేసిందని, దాతల సహకారం, విరాళాలతో చేయాల్సి రావడం విచారకరమని అన్నారు. ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ఆదాయాన్ని మాత్రం లెక్కించి టీటీడీ తీసేసుకుంటున్నదని, మరి స్వామివారి సేవలు, ఉత్సవాలను ఎందుకు నిర్వహించడంలేదని ప్రశ్నించారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు చెప్పారు. మరో నెల రోజుల్లో స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయని, దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం గ్రామ పంచాయతీకి ఇవ్వలేదని, ఉత్సవాల తరువాత ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు తాము చేయాల్సివస్తోందని ఇన్‌చార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు చెప్పారు.

కొలిక్కిరాని వలంటీర్ హరినాథ్ హత్య కేసు

- 25 రోజులుగా కొనసా..గుతున్న విచారణ

మాకవరపాలెం, ఫిబ్రవరి 25: మండలంలో లచ్చన్నపాలెంలో ఇటీవల జరిగిన వలంటీర్ హరినాథ్ హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. ఫిబ్రవరి 1వ తేదీన లచ్చన్నపాలెం వలంటీర్ హత్యకు గురయ్యాడు. 25 రోజులు కావస్తున్నా ఈ కేసులో నిందితులను ఇంతవరకు అరెస్టు చేయలేదు. వలంటీర్‌కు గ్రామంలోనే కాకుండా ఇతర గ్రామాల్లో కూడా వివాహేతర సంబంధాలు ఉన్నట్టు వెలుగుచూడడంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే గ్రామానికి చెందినవారితో పాటు ఇతర గ్రామాలకు చెందిన సుమారు 70 మందిని విచారించారు. కొందరు ప్రముఖులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను విచారణ చేశారు. అయితే మృతుడు సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ కొనసాగించారు. ఇప్పటికే ఎవరు హత్య చేశారనేది ప్రాథమిక నిర్ధారణకు పోలీసులు వచ్చినట్టు సమాచారం. అయితే సీడీఆర్ వాట్సాప్ ఫోన్‌కాల్ డేటా కోసం కూడా ఎదురు చూస్తున్నారనే ప్రచారం సాగుతున్నది. ఈ కేసు నర్సీపట్నం రూరల్ సీఐ హరి, నాతవరం ఎస్ఐ రామారావు, కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర, మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు విచారణ చేస్తున్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఎస్ఐ రామకృష్ణరావుని వివరణ కోరగా.. విచారణ తుదిదశకు చేరిందని, మరో రెండు రోజుల్లో హత్య చేసిన వారిని గుర్తిస్తామన్నారు.

బుచ్చెయ్యపేట వైసీపీలో ముదిరిన వర్గపోరు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసి, వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే వైసీపీ ఓడిపోతుందని చెప్పారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సమన్వయకర్తగా నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ధర్మశ్రీ, అతని సోదరుల అవినీతి చర్యల వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారంటూ కొంతమంది నాయకులు సీఎంకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అసంతృప్తి వాదులను చల్లబరిచేందుకు విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం.

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు

... 5వ పేజీ తరువాయి

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించిన కొన్ని కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ సందర్శించారు. వుడా పార్కు ఎదురుగా ఎంఎల్‌టీటీ స్కూలులో ఏర్పాటు చేసిఇన కేంద్రాన్ని తనిఖీచేసి అభ్యర్థుల సంతకాల రిజిస్టర్ పరిశీలించారు. రోల్ నంబరు ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్స్ తనిఖీ చేశారు. వారి వెంట కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి, కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఉన్నారు.

'పీలా'కు న్యాయం చేయాలి

- టీడీపీ నాయకులు, కార్యకర్తలు వినతి

కశింకోట, ఫిబ్రవరి 25 : మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు న్యాయం చేయాలని మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు మాట్లాడుతూ, ఐదేళ్ల నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న పీలా గోవిందకు టికెట్ ఇవ్వకపోవడం తమను బాధించిందని అన్నారు. ఈ సమావేశంలో కాండ్రేగుల సతీశ్‌కుమార్, ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీను తదితరులు మాట్లాడారు. వేగి గోపీకృష్ణ, ఒమ్మి సత్యనారాయణ, షేక్ బాబర్, మళ్ల లోవకృష్ణ, తాకాశి కృష్ణ, సిదిరెడ్డి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పీలా కార్యాలయంలో..

తుమ్మపాల: అనకాపల్లి అసెంబ్లీ సీటును జనసేనకు కేటాయించడంపై కొంతమంది టీడీపీ నేతలు ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మళ్ల సురేంద్ర, కర్రి బాబి, బొడ్డపు ప్రసాద్, కొణతాల శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ, పొత్తులో భాగంగా అనకాపల్లి సీటును జనసేనకు కేటాయించడంపై టీడీపీ అధినేత చంద్రబాబు పునరాలోచించాలని కోరారు.

అధిష్ఠానం ముందుగా చెప్పి ఉంటే బాగుండేది

- కొణతాలకు టికెట్‌పై పరుచూరి మనోగతం


కంట తడిపెడుతున్న జనసేన ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు

కొత్తూరు, ఫిబ్రవరి 25 : జనసేన పార్టీ బలోపేతానికి గత ఐదేళ్ల నుంచి కృషి చేస్తున్నానని, ఎవరినీ ఇబ్బందులకు గురి చేయలేదని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు అన్నారు. ఆదివారం ఇక్కడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధిష్ఠానం ఒక్క మాటైనా చెప్పకుండా ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించడం తనను ఆవేదనకు గురిచేసిందని కంట తడిపెట్టారు. అయినప్పటికీ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు కొణతాల రామకృష్ణకు పూర్తిగా సహకరించి, ఆయన గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు. పార్టీ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ఇన్‌చార్జి బాధ్యతలు రామకృష్ణకు అప్పగిస్తానని భాస్కరరావు తెలిపారు.

సంపతిపురం లేఅవుట్‌పై విచారణ జరిపించాలి

తుమ్మపాల, ఫిబ్రవరి 25: సంపతిపురం లేఅవుట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు వైఎన్ భద్రం, చెల్లూరి నాగరాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంపతిపురం లేఅవుట్ 2/2లో జరుగుతున్న 303 ఇళ్ల నిర్మాణాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఈ అంశంలో అధికారుల పాత్ర కూడా ఉందని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు నకిలీ పట్టాలు తయారుచేసి అమ్మకాలు చేపట్టి కోట్లాది రూపాయలు కూడబెట్టుకున్నారన్నారు. దీనిపై జ్యుడిషియల్ విచారణ చేపట్టాలని లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు.

నేడు సర్పంచుల ధర్నాకు తరలిరావాలి

పరవాడ, ఫిబ్రవరి 25: జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించనున్న ధర్నాకు సర్పంచులు తరలిరావాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షురాలు చింతకాయల సుజాత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం దొంగిలించిన 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు సర్పంచుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన సర్పంచులు తరలిరావాలని ఆమె కోరారు.

జార్జిక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గసభ్యులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25 : స్థానిక జార్జిక్లబ్ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం ఆదివారం రాత్రి జరిగింది. అధ్యక్షులుగా బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శిగా బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, కోశాధికారిగా వి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడుగా కేబీఎం వెంకటరావు, జాయింట్ సెక్రటరీగా కె.శ్రీనివాసరావుతో పాటు ఆరుగురు కార్యవర్గసభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పూర్వ కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడు జోగినాయుడు మాట్లాడుతూ నూతన సభ్యుల సహాయ సహకారాలతో క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రిటైర్డు డీఈవో గౌరీపతి నూతన కమిటీతో ప్రమాణం చేయించారు.

ఘనంగా విఘ్నేశ్వర ఆలయ ప్రారంభ క్రతువులు


ఆలయానికి 108 బిందెలతో జలాలు తీసుకెళ్తున్న మహిళలు

నక్కపల్లి, ఫిబ్రవరి 25: స్థానిక వీవర్స్ కాలనీలో కొత్తగా నిర్మించిన విఘ్నేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం సాయంత్రం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 28వ తేదీ వరకూ ఆలయ ప్రారంభత్సవాలు, ప్రతిష్ఠ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తొలి రోజు ఉపమాక ఆలయం నుంచి 108 కలశలతో మహిళలు విఘ్నేశ్వర ఆలయానికి జలాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. రాత్రి గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విక్ వరుణ, అంకురార్పణ వంటి కార్యక్రమాలు చేపట్టారు.

డిగ్రీ విద్యార్థుల అ'పూర్వ' కలయిక


డిగ్రీ కళాశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఎలమంచిలి, ఫిబ్రవరి 25: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1993-96 బీఏ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో. పూర్వ విద్యార్థి ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. జానకీరామ్, సహచర పూర్వ విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం తాము చదివిన కళాశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటునందిస్తామని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, పీడీ పోలిరెడ్డి తదితరులు పాల్గొని పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో పలువురి చేరిక


అనిత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన నేతలు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 25: మండలంలోని వెంకటనగరం 4వ వార్డు మెంబరు సూరాడ శివయ్య, వంకా సూరిబాబు, సూరాడ శ్రీను, అర్జిల్లి శివ, పెదకాపు చంటి తదితరులు ఆదివారం తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి అనిత పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వంకా వెంకటరమణ, వంకా శివకుమార్, వంకా హరి, పారా గాలి బాబు, గరికిన అప్పారావు, గరికిన శివ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర శిబిరంలో 300 మందికి పరీక్షలు


పరిశీలిస్తున్న దొరస్వామి

అచ్యుతాపురం, ఫిబ్రవరి 26: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన 121 ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వీరిలో 186 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 89 మందికి మందులు ఇచ్చారు. 25 మందికి శస్త్రచికిత్సలు చేయించాలని వైద్యులు నిర్ధారించారు. వీరికి విశాఖలో గల శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలను చేయిస్తామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరస్వామి తెలిపారు. వీరికి రవాణా, భోజన,వసతి సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అలాగే ఆదివారం ఇక్కడకు వచ్చిన రోగులందరికీ మజ్జిగ, ఫలహారాలు, భోజన సదుపాయాలు కల్పించామన్నారు.

వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శివాజీకి సన్మానం


వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శివాజీని సత్కరిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, ఫిబ్రవరి 25 : తుని, పాయకరావుపేటల్లో పేదలకు పలు సేవా సామాజిక కార్యక్రమాలు చేస్తున్న వాకర్స్ క్లబ్ జిల్లా గవర్నర్ చదరం శివాజీని ఆదివారం పలువురు ఘనంగా సత్కరించారు. స్థానిక హైమా నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డాక్టర్ పీఎస్ఆర్.ప్రసాద్ ఆయన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు కలిదిండి సత్యనారాయణరాజు, అడపా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా దివ్యాంగుల విహారయాత్ర


కొబ్బరితోటలో ఉన్న దివ్యాంగులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25: విశాఖ తోటగరువుకు చెందిన దివ్యాంగుల సేవా సంఘం సభ్యులు ఆదివారం విహారయాత్రలో భాగంగా నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం దివ్యాంగులంతా ఆలయం సమీపంలోని కొబ్బరి తోటలో ఉల్లాసంగా గడిపారు. సంఘ అధ్యక్షుడు ఒమ్మి రామరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ విహారయాత్రలో సభ్యులు ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ ఇటువంటి విహారయాత్ర వల్ల స్నేహబంధం మరింత బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు వీరభద్రం, వేటూరి శ్రీనివాసరావు, మురళీ, భుజంగరావు, బి. భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టుబడిన వాహనాలు వేలం

పాయకరావుపేట, ఫిబ్రవరి 25: పాయకరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో నమోదైన సారా, మద్యం బాటిళ్ల అక్రమ తరలింపు తదితర కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలకు సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్టు ఎస్ఈబీ సీఐ ధర్మారావు తెలిపారు. ఎస్ఈబీ స్టేషన్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలం పాటలో ఆసక్తి గల పాటదారులు పాల్గొనవలసినదిగా కోరారు.

ఘనంగా రజకుల బల్లల పండగ

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలో ఆదివారం రజకుల సంఘం ఆధ్వర్యంలో రజకుల బల్లల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రజకుల ఊరేగింపులో ఏర్పాటు చేసిన శక్తి వేషాధారణ చూపరులను ఆకట్టుకొంది. కార్యక్రమంలో రజకుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వయో వృద్ధులకు రాయితీలు కల్పించాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 25: వయో వృద్ధులకు చట్టపరంగా రాయితీలను కల్పించాలని వయో వృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, కార్యదర్శి బీశెట్టి కృష్ణఅప్పారావు కోరారు. ఈ మేరకు డిజేబుల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఒక లేఖ రాశారు. సంస్థ తరుపున ప్రతి నెలా ఐదో తేదీన సమస్యలపై సమావేశం ఏర్పాటు చేసి, ఉన్నతాధికారులకు వివరిస్తున్నామన్నారు. 60 ఏళ్ల పైబడిన వారికి గుర్తింపు కార్డులు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు, రైల్వే, ఇతర సంస్థల్లో ఈ గుర్తింపుకార్డులు చూపించినా ఉపయోగపడడం లేదన్నారు. ఈ కార్డులకు అన్ని సంస్థల్లో గుర్తింపు పొందగలిగే రాయితీలను కలుగజేయాలని వారు కోరారు.

నేడు పెదబోదిగల్లం రైల్వే అండర్ పాస్ ప్రారంభం

నక్కపల్లి, ఫిబ్రవరి 25: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా కొత్తగా రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్లు వద్ద నిర్మించిన అండర్ పాస్ వంతెనలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ప్రధాని మోదీ సోమవారం మధ్యాహ్నం పెదబోదిగల్లం వద్ద నిర్మించిన రైల్వే అండర్ పాస్‌ను జాతికి అంకితం చేయనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో వీటిని ప్రారంభిస్తారు.

నేడు చంద్రబాబు ట్రాన్సిట్ హాల్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సోమవారం జిల్లాలో ట్రాన్సిట్ హాల్ట్ చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఉండవల్లిలో తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి శ్రీకాకుళం వెళ్లి, బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.45 గంటలకు శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గాన 6.30గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడి నుంచి విమానంలో 6.40 గంటలకు గన్నవరం బయలుదేరుతారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

గొయ్యిలోకి దిగిన ఆటో : మహిళకు గాయాలు



ప్రమాదంశాత్తు గొయ్యిలోకి దిగిపోయిన ఆటో

గొలుగొండ, ఫిబ్రవరి 25: ఆటో గొయ్యిలోకి దిగిపోవడంతో మహిళకు గాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎస్ఐ కృష్ణారావు ఆదివారం అందించిన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి లింగంపేటకు వెళ్తున్న ఆటో మండలంలోని కొత్తజోగంపేట మలుపులో ఆటో అదుపు తప్పి పక్కనే ఉన్న గొయ్యిలోకి దూసుకుపోయింది. దీంతో గొలుగొండ మండలం ఉగ్గంపేటకి చెందిన కొరుప్రోలు రమణమ్మ కాలు, కుడిచేయికి తీవ్ర గాయమైనట్టు తెలిపారు. వెంటనే ఆమెను 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.48 లక్షలు మంజూరు

నర్సీపట్నం, ఫిబ్రవరి 25 : స్థానిక అబీద్ సెంటర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం రూ.48లక్షలు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ తెలిపారు. ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధి పెదపాటి గోవిందరావుకి ఎమ్మెల్యే మంజూరు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో జెఎస్ఎస్ నాగేశ్వరరావు, గానుగుల రమణబాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



మాకవరపాలెం, ఫిబ్రవరి 25: మండలంలోని మాకవరపాలెం హైస్కూల్‌లో 1994-95వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం రాచపల్లి కామేశ్వరమ్మ గుడి వద్ద కలుసుకున్నారు. ఆటపాటలతో ఆనందిస్తూ అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం వచ్చే ఏడాది మే నెలలో కుటుంబాలతో కలవాలని నిర్ణయించారు. అలాగే తమ బ్యాచ్‌లో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారిని ఆదుకోవాలని నిర్ణయించారు.

అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధిలో వైసీపీ ప్రభుత్వం విఫలం

జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 25: అల్లూరి స్మారక ప్రాంతాలు అభివృద్ధి పరచడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని, టీడీపీ అధికారంలోకి రాగానే అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడిని జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు కోరారు. ఈ మేరకు ఆదివారం అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కృష్ణాదేవిపేట అల్లూరి సీతారామరాజు, గంటందొర సమాధులున్న స్మారకపార్కు, నర్సీపట్నంలో బ్రిటిష్ సమాధులు అల్లూరి చరిత్రలో సాక్షిభూతంగా నిలిచాయని, వాటిని పరిరక్షించడం, అభివృద్ధి పరచడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. కృష్ణాదేవిపేట అల్లూరి పార్కులో ప్రహరీగోడ కొంతమేరకు కూలిపోయిందని, లోపల కట్టడాలు శ్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంటున్నాయని, వాటర్ పైప్‌లైన్లు దెబ్బతిన్నాయన్నారు. వైసీపీ అధికారంలో వచ్చిన తర్వాత పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించామని మాజీ పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాసరావు ప్రకటించగా.. మరోసారి డిప్యూటీ సీఎం రాజన్నదొర రూ.66 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించి సంవత్సరాలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని వీరభద్రరావు ఆరోపించారు. బ్రిటీష్ సమాధుల స్థలాన్ని అధికార పార్టీకి చెందినవారే ఆక్రమించడానికి ప్రయత్నించారని, మీడియాలో ప్రచారం జరగడం, స్థానికులు అడ్డుకోవడం వల్ల ఆక్రమణలకు గురికాకుండా ఆగిందన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తే అల్లూరి స్మారకమందిరాలు అభివృద్ధి చేయాలని ఆయన అయ్యన్నపాత్రుడిని కోరారు. పదోసారి అసెంబ్లీ పోటీ చేసేందుకు టికెట్ రావడం పట్ల అయ్యన్నకు ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల వరలక్ష్మి పాల్గొన్నారు.



అయ్యన్నకు వినతిపత్రం అందింస్తున్న వీరభద్రరావు

అవంతి కాలేజీలో గ్రూప్-2 పరీక్షా కేంద్రం తనిఖీ

మాకవరపాలెం, ఫిబ్రవరి 25: స్థానిక అవంతి కాలేజీలో నిర్వహించిన గ్రూప్--2 పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ ఆదివారం పరిశీలించారు. మండలంలో తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో 1,300 మంది అభ్యర్థులు గ్రూప్-2 పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం ఈపరీక్షా కేంద్రాన్ని ఎస్పీ పరిశీలించారు. అనంతరం డీఎస్పీ వెంకటరామయ్య, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్ఐ రామకృష్ణారావు పాల్గొన్నారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీకి వచ్చిన ఎస్పీ మురళీకృష్ణ

కొలిక్కిరాని వలంటీర్ హరినాథ్ హత్య కేసు

» 25 రోజులుగా కొనసా..గుతున్న విచారణ



హరినాథ్(ఫైల్‌ఫొటో)

మాకవరపాలెం, ఫిబ్రవరి 25: మండలంలో లచ్చన్నపాలెంలో ఇటీవల జరిగిన వలంటీర్ హరినాథ్ హత్య కేసు ఇంకా కొలిక్కి రాలేదు. ఫిబ్రవరి 1వ తేదీన లచ్చన్నపాలెం వలంటీర్ హత్యకు గురయ్యాడు. 25 రోజులు కావస్తున్నా ఈ కేసులో నిందితులను ఇంతవరకు అరెస్టు చేయలేదు. వలంటీర్‌కు గ్రామంలోనే కాకుండా ఇతర గ్రామాల్లో కూడా వివాహేతర సంబంధాలు ఉన్నట్టు వెలుగుచూడడంతో ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే గ్రామానికి చెందినవారితో పాటు ఇతర గ్రామాలకు చెందిన సుమారు 70 మందిని విచారించారు. కొందరు ప్రముఖులతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను విచారణ చేశారు. అయితే మృతుడు సెల్‌ఫోన్ ఆధారంగా విచారణ కొనసాగించారు. ఇప్పటికే ఎవరు హత్య చేశారనేది ప్రాథమిక నిర్ధారణకు పోలీసులు వచ్చినట్టు సమాచారం. అయితే సీడీఆర్ వాట్సాప్ ఫోన్‌కాల్ డేటా కోసం కూడా ఎదురు చూస్తున్నారనే ప్రచారం సాగుతున్నది. ఈ కేసు నర్సీపట్నం రూరల్ సీఐ హరి, నాతవరం ఎస్ఐ రామరావు, కేడీపేట ఎస్ఐ ఉపేంద్ర, మాకవరపాలెం ఎస్ఐ రామకృష్ణారావు విచారణ చేస్తున్నారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో జాప్యం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై ఎస్ఐ రామకృష్ణరావుని వివరణ కోరగా.. విచారణ తుదిదశకు చేరిందని, మరో రెండు రోజుల్లో హత్య చేసిన వారిని గుర్తిస్తామన్నారు.

గ్రామాలలో కుక్కలు స్వైరవిహారం

» భీతిల్లుతున్న పిల్లలు, వృద్ధులు, వాహనదారులు



నాతవరం కొత్త వీధిలో కుక్కల గుంపు

నాతవరం, ఫిబ్రవరి 25: మండలంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో వృద్ధులు, పిల్లలు బయటకు వచ్చేందుకు భీతిల్లుతున్నారు. మండల కేంద్రంతోపాటు గుమ్మిడిగొండ, మర్రిపాలెం, గునుపూడి తదితర గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువైంది. పిల్లలు పాఠశాలకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చేటప్పుడు దగ్గరుండి తీసుకెళ్లవలసివస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము లేకుంటే పిల్లలపై కుక్కలు దాడి చేస్తున్నాయని వారు చెబుతున్నారు. రాత్రి ఏడు గంటల సమయంలో మహిళలు కిరాణా దుకాణాలకు వెళితే కుక్క కాటుకు గురికావలసి వస్తున్నదన్నారు. రాత్రి వేళల్లో మోటారు సైకిళ్లపై వెళుతుంటే కుక్కలు వెంటబడుతున్నాయని, పలు పర్యాయాలు ప్రమాదాలకు గురికావలసి వస్తున్నదని వాహనదారులు అంటున్నారు. నాతవరంలో ప్రతీ వీధిలో 80నుంచి 100 వరకు కుక్కలు ఉన్నాయని, వీటి బెడద లేకుండా ఎవ్వరూ చర్యలు తీసుకోలేదని మండల కేంద్రవాసులు వాపోతున్నారు. అలాగే గొర్రెలు, మేకల మందలపైనా కుక్కలు దాడి చేస్తున్నాయని వారంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామాలలో కుక్కల బెడద లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వైసీపీలో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

శనివారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలను కలవరపాటుకి గురిచేశాయి. అంతేకాకుండా ప్రస్తుత ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలపై అసమ్మతి వున్న నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉంటుందనే ఊహాగానాలు జోరందుకున్నాయి. దీంతో టికెట్ ఎవరికి వస్తుందో తెలియక నేతలు, కార్యకర్తలు అయోమయంలో ఉన్నారు. మరోవైపు టీడీపీ, జనసేన పార్టీల అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతుండగా... అభ్యర్థులు ఎవరన్న దానిపై స్పష్టత లేక వైసీపీ శ్రేణులు నిరుత్సాహంలో కూరుకుపోయాయి.

అటకెక్కిన మినీ రిజర్వాయర్

... 5వ పేజీ తరువాయి

సుమారు రూ.1.5 కోట్ల విలువ చేసే పూడికతీత పనులు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా స్లూయిస్, కాలువలు, కలింగల పనులు చేయాల్సి వుంది. అయితే భారీ వర్షాలకు పూడిక పేరుకుపోవడంతో పాత టెండర్ మేరకు పనులు చేయడం సాధ్యం కాదని కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. అంచనాలను సవరించి, కొత్త ప్రతిపాదనలు తయారు చేసే తరుణంలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల నుంచి స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జలవనరుల శాఖ అధికారులు దీని గురించి పట్టించుకోవడంలేదు.

ఉపమాక క్షేత్రంపై టీటీడీ నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సహకారంతో చేయాల్సి వచ్చిందని ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు, ఉపమాక ఇన్‌చార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి బుజ్జి, జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, నున్న కాశీ, వైసీపీ నేతలు సిద్దా బత్తుల కృష్ణ, నూకతాత ఆవేదన వెలిబుచ్చారు. కొవిడ్-19 తరువాత నుంచి నిత్యాన్నదానం కూడా టీటీడీ నిలిపివేసిందని, దాతల సహకారం, విరాళాలతో చేయాల్సి రావడం విచారకరమని అన్నారు. ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ఆదాయాన్ని లెక్కించి టీటీడీ తీసేసుకుంటున్నదని, మరి స్వామివారి సేవలు, ఉత్సవాలను ఎందుకు నిర్వహించడంలేదని ప్రశ్నించారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు చెప్పారు. మరో నెల రోజుల్లో స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయని, దీనికి సంబంధించి ఎటువంటి సమాచారం పంచాయతీకి ఇవ్వలేదని, ఉత్సవాల తర్వాత ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేయాల్సివస్తోందని ఇన్‌చార్జి సర్పంచ్ ప్రగడ వీరబాబు చెప్పారు.

ముదిరిన వర్గపోరు

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటు చేసి, వచ్చే ఎన్నికల్లో ధర్మశ్రీకి టికెట్ ఇస్తే వైసీపీ ఓడిపోతుందని చెప్పారు. ఆయన స్థానంలో మరో వ్యక్తిని సమన్వయకర్తగా నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ధర్మశ్రీ, అతని సోదరుల అవినీతి చర్యల వల్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారంటూ కొంతమంది నాయకులు సీఎంకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు అసంతృప్తి వాదులను చల్లబరిచేందుకు విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు సమాచారం.

గ్రూప్-2 అభ్యర్థులకు చుక్కలు

... 5వ పేజీ తరువాయి

గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష (స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహించిన కొన్ని కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్ సందర్శించారు. వుడా పార్కు ఎదురుగా ఎంవీపీ స్కూలులో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని తనిఖీచేసి అభ్యర్థుల సంతకాల రిజిస్టర్ పరిశీలించారు. రోల్ నంబరు ప్రకారం సీటింగ్ అరేంజ్‌మెంట్స్ తనిఖీ చేశారు. వారి వెంట డిపార్టుమెంటల్ అధికారి, కనకమహాలక్ష్మి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ ఉన్నారు.

చోడవరం
నియోజకవర్గం



తాగునీటి సమస్యపై నిరసన తెలుపుతున్న మహిళలు

తాగునీటి సమస్యపై మహిళల ఆందోళన

చోడవరం, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని కోటవీధిలో తాగునీటి సమస్యలపై మహిళలు ఆందోళనకు దిగారు. గతంలో వీధి కొళాయిలు ఉన్నప్పుడే అందరికీ తాగునీరు చక్కగా అందేదని, ఇపుడు ఇంటింటికీ కొళాయి ఇచ్చినప్పటికీ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని మహిళలు వాపోయారు. పంచాయతీ అధికారులకు సమస్య తెలిపినా స్పందన లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి సమస్య తీర్చని పక్షంలో వచ్చే ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతామని కోటవీధి మహిళలు దేవి, రుత్తల లక్ష్మి, వరలక్ష్మి, అల్లంకి లక్ష్మి స్పష్టం చేశారు.

బీజేపీ అభ్యర్థిగా పోటీ : ఈర్లె శ్రీరామమూర్తి

చోడవరం, ఫిబ్రవరి 25: టీడీపీతో పొత్తులో భాగంగా చోడవరం లేదా మాడుగుల నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈర్లె శ్రీరామమూర్తి ఆదివారం విలేకరులకు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ జీవితంతో పాటు ఈ ప్రాంతవాసిగా రెండు నియోజకవర్గాల్లో తనకు బంధుత్వాలు, అభిమానుల అండ ఉందని చెప్పారు. పొత్తులో సీటు లభిస్తే రెండు నియోజకవర్గాల్లో ఏదో చోట బరిలో దిగే అవకాశం ఉందన్నారు.

పద్మశాలీ సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గం ఏర్పాటు

చోడవరం, ఫిబ్రవరి 25: పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం మండల అధ్యక్షుడిగా సప్పా కొండలరావు నియమితులయ్యారు. అలాగే కార్యదర్శిగా కోసూరి నారాయణరావు, సంయుక్త కార్యదర్శులుగా వంక సూర్యనారాయణ, దొడ్డి సత్యనారాయణ, కోశాధికారిగా నేమాల హరితో పాటు 20 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, రాష్ట్ర నాయకులు రుషిబాబు, పప్పు శ్రీనులు హాజరయ్యారు.

యువత తొలి ఓటు చంద్రబాబుకే వేయాలి

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25: సార్వత్రిక ఎన్నికల్లో యువత మొదటి ఓటును రాష్ట్రాభివృద్ధికి పాటుపడే చంద్రబాబుకే వేయాలని టీడీపీ పార్టీ ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం వడ్డాదిలో జరిగిన మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఐటీ కంపెనీలు ప్రారంభించి యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించడానికి చంద్రబాబు కృషి చేస్తే, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కంపెనీలను తరిమివేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పన, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి అందిస్తామన్నారు. విజన్ కలిగిన చంద్రబాబుకు ఓటు వేయడం ద్వారా స్కిల్ డెవలప్మెంట్, మహిళా సాధికారతకు పెద్దపీట వేయాలని కోరారు. దుర్మార్గ పాలనతో ఏపీ ప్రగతిని పాతాళానికి దిగజార్చిన జగన్‌కి ఓటు వేయవద్దని, వారిలో చైతన్య తీసుకొచ్చేలా విరివిగా కార్యక్రమాలు నిర్వహించాలని విజయ్ సూచించారు. అరాచక, అవినీతి, దుర్మార్గ పాలన చేస్తున్న జగన్‌కి ఓటు వేస్తే ఏపీ భవిత అంధకారంగా మారగలదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ అవినీతికి హద్దే లేకుండా పోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే .రాజు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, తెలుగు యువత రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు వి.నాగసూర్యచంద్రుడు, ఎస్.శ్రీరామూర్తి, నాయకులు కెనీలవేణి, గోకివాడ కోటేశ్వరరావు, దొంకిన అప్పలనాయుడు, కోట గోవింద, ముచ్చకర్ల తాతయ్యలు, భవాని, వియ్యపు అప్పారావు, దొడ్డి కిషోర్, సాయం రమేష్, ద్వారపూడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్, పక్కన తాతయ్యబాబు, నాయకులు





చీడికాడ: రామానాయుడును గెలిపిస్తామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ నాయకులు... మాడుగుల: సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గవిరెడ్డికి టికెట్ ఇవ్వండి

మాడుగుల, చీడికాడ మండలాల టీడీపీ నేతల వినతి

మాడుగుల రూరల్/చీడికాడ, ఫిబ్రవరి 25: మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు ఇస్తే భారీ మెజారిటీతో గెలిపిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు మాడుగుల మండలంలోని జమ్మాదేవిపేట, చీడికాడ మండలంలోని జి.కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో వారంతా ప్రమాణం చేశారు. గవిరెడ్డికి టికెట్ ఇస్తే బూడి ముత్యాలనాయుడుపై సులభంగా గెలుపొందవచ్చునని అభిప్రాపడ్డారు. అయితే పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి అంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపొందడానికి అహర్నిశలు శ్రమిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ గవిరెడ్డి పార్టీ కార్యక్రమాలు, పాదయాత్రలు చేశారని, దేవాలయాల నిర్మాణాలకు, తోచిన సాయం అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాడుగుల మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, సర్పంచులు పెంటకోట జగన్నాథరావు, సింహాచలం నాయుడు, కొండఅప్పారావు, జయరాం, జెర్రిపోతుల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మైచర్ల సన్యాసిరావు, మాజీ సర్పంచ్‌లు, సీడీసీ మాజీ చైర్మన్ మజ్జి తాతబాబు, చీడికాడల మండల మహిళా నాయకులు గండి లక్ష్మి, కనితి దేముడమ్మ, కోనాం జలాశయ మాజీ చైర్మన్ గండి మునలినాయుడు, ఎంపీటీసీ సభ్యులు డి.పెద్దినాయుడు, బీశ్ల కోటేశ్వరరావు, పి.అమ్మతల్లి నాయుడు, నాయకులు కొల్లి సూరినాయుడు, పి.దాలెంనాయుడు, ఎస్.శివ, జి.నానాజీ, జె.ప్రసాద్, ఎం.నానాజీ, పి.ఎర్రునాయుడు, డి.దేముడుబాబు, డోకల అక్కునాయుడు, కసిరెడ్డి శ్రీరామ్మూర్తి, సింగంపల్లి అప్పారావు, బండారు దయాకర్, పల్లి రాజబాబు, కొల్లి పైడంనాయుడు పాల్గొన్నారు.

జగన్ మోసాల ప్రచారానికే ప్రజా పోరు యాత్ర

రోలుగుంట, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో సీఎం జగన్ మోసాల గురించి ప్రజలకు వివరించడానికే ప్రజా పోరు యాత్ర చేపడుతున్నామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కె.రమణమూర్తి చెప్పారు. మండలంలోని బుచ్చెంపేటలో పార్టీ మండల అధ్యక్షుడు కర్రి తమ్మునాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రజా పోరు యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిందని పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే, రివర్స్ టెండరింగ్ పేరుతో సీఎం జగన్ దోచుకున్నారన్నారు. మద్యపాన నిషేధం ఎక్కడా లేదని, నాణ్యత లేని మద్యం ఇచ్చి ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారని వాపోయారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నాయుడు, శ్రీనివాసరావు, బాబ్జి, జగదీష్ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే ధర్మశ్రీ గెలుపే లక్ష్యం'

బుచ్చెయ్యపేట, ఫిబ్రవరి 25: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు అన్నారు. పతిపక్షం నుంచి వైసీపీలోకి వచ్చిన నాయకులు తిరిగి సొంత గూటికి వెళ్లిపోయేందుకే ధర్మశ్రీపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యకర్తలకు, ప్రజలకు ధర్మశ్రీ అదుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, నాయకులు జి.కొండబాబు, జి.శ్రీనివాసరావు, పినపోలు రామునాయుడు, యల్లపు విజయకుమార్, దొండా నారాయణమూర్తి, కోవెల ఈశ్వరరావు, గుడాల ఆనంద్ పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి ఘటాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

మాడుగుల, ఫిబ్రవరి 25: స్థానిక మోదకొండమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువ జాము ఆరు గంటల నుంచి అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించారు. నెత్తిన ఘటాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు. స్థానిక న్యాయవాది శ్రీనాద ప్రసాదరావు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్న సమారాదం చేశారు. భక్తుల సౌకర్యార్థం చైర్మన్ పుప్పాల అప్పలరాజు పర్యవేక్షణలో కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చూశారు.

మోదకొండమ్మ తీర్థం రేపు

ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్యదైవం మోదకొండమ్మ తీర్థ మహోత్సవం మంగళవారం జరగనుంది. ఇందుకోసం గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ చేస్తున్నారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే వాలీబాల్ టోర్నమెంట్‌తో పాటు ఎండ్ల పరుగు పందెం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించేలా కమిటీ చర్యలు తీసుకున్నారు.

మాడుగుల
నియోజకవర్గం

నేడు చంద్రబాబు ట్రాన్సిట్ హాల్ట్

విశాఖపట్నం, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు సోమవారం జిల్లాలో ట్రాన్సిట్ హాల్ట్ చేస్తారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ఉండవల్లిలో తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి శ్రీకాకుళం వెళ్లి, బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 4.45 గంటలకు శ్రీకాకుళం నుంచి రోడ్డు మార్గాన 6.30గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ఇక్కడి నుంచి విమానంలో 6.40 గంటలకు గన్నవరం బయలుదేరుతారు.

ముగిసిన ఎడ్ల పరుగు పోటీలు

» సిద్ధివినాయక ఎడ్ల జతకు ప్రథమ బహుమతి

దేవరాపల్లి, ఫిబ్రవరి 25: ఉమామహేశరిదేవి తీర్థ మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు ఆదివారంతో ముగిశాయి. తుది పోరులో సిద్ధివినాయక (వల్లంపూడి) ఎడ్ల జత ప్రథమ బహుమతి సాధించింది. అలాగే పైడితల్లమ్మ తల్లి (లెక్కలవానిపాలెం) ఎడ్ల జత, శ్రీఆంజనేయ (కె.జేపురం), ఏడువాక సత్తిబాబు (వల్లంపూడి), పరవాడ నాయుడు (అర్జునగిరి), జైవీరాంజనేయ (దేవరాపల్లి) తరువాత ఆరు స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతు లను అందజేశారు.

వమ్మలిలో ఘనంగా మోదకొండమ్మ తీర్థం

మాడుగుల రూరల్: మండలంలోని వమ్మలి చెరకు కాటా జంక్షన్‌లో మోదకొండమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు జరిపించారు. చుట్టు పక్కల గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యులు కాతా వెంకటరమణ, కోటేశ్వరరావు, దొర, కోట్ని శ్రీను, శ్రీనివాసరావు, కొండబాబు, ఈశ్వరరావు తదితరులు ఏర్పాట్లు చేపట్టారు.

అర్జునగిరిలో అన్నసమారాధన

చీడికాడ, ఫిబ్రవరి 25: మండలంలోని అర్జునగిరి గ్రామంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. స్వయంభూ వరహాలక్ష్మి నృసింహస్వామి ముగింపు ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ బి.రమాదేవి, మాజీ సర్పంచ్ యామల లక్ష్మణ, రిటైర్డ్ హెచ్ఎం బండారు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ సభ్యులు పెంటకోట అమ్మతల్లినాయుడు, జె.ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

64 మందికి కంటి పరీక్షలు

దేవరాపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని వేచలం గ్రామంలో 64 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు అమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు హరిచందన, క్యాంపు కోఆర్డినేటర్ అశ్వన్‌కుమార్ నాలుగు వేల మందికి పరీక్షలు చేయగా, 27 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారని చెప్పారు. వీరిని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఆర్.బలరామ్మూర్తి, చప్పా నాగేమ, నరసింహనాయుడు, రెడ్డి శ్రీనివాస్, రామకృష్ణ సత్యారావు, రవి పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యం

దేవరాపల్లి, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. మండలంలోని తారువలో జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనూరాధ అధ్యక్షతన జరిగిన మహిళా సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు దేశానికి దిశ నిర్దేశం చేయాలని నామినేటెడ్ పదవుల్లో ఏభై శాతం మహిళలకు ఇచ్చే విధంగా ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డిబిటి), ద్వారా దాదాపు రూ.95,867,10 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె.అనూరాధ, వైసీపీ జిల్లా అధ్యక్షులు.బొడ్డేడ ప్రసాదు, దేవరాపల్లి, మాడుగుల, కెకోటపాడు మండల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.